

క్రీడల్లో వైవీయూకు బంగారు పతకం

ప్రజాశక్తి - కడప అర్బన్

తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీలో ఈ నెల 20 నుంచి 25 వరకు నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో వైవీయూకి బంగారు పతకం వచ్చిందని వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. బద్వేల్ శ్రీమతి నారాయణమ్మ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థి మురళీ కృష్ణ జాతీయ అంతర విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. 59 కిలోల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారని తెలిపారు. స్క్వాట్ విభాగంలో 250 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 130కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 240 కిలోలు మొత్తం 620 కిలోల బరువునెత్తి బంగారు పతకం సాధించారని చెప్పారు. విసి సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి క్రీడాకారుడిని అభినందించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు : జడ్జి



మాట్లాడుతున్న జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - కడప

విద్య ఎంతో విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ ఇన్‌ఛార్జి సెక్రటరీ ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా శనివారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1979, మే 25న న్యూయార్క్‌లో పాఠశాలకు వెళుతున్న ఆరేళ్ల పిల్లవాడైన ఎటాన్ పాట్జ్ అదృశ్యమయ్యాడని, ఎప్పటికీ ఛేదించలేని మిస్టరీగా ఆ కేసు మిగిలిపోయిందని అన్నారు. 1983లో యునైటెడ్ స్టేట్స్ అధ్యక్షులు రోనాల్డ్ రీగన్ మే 25ను ఎటాన్ పాట్జ్ జ్ఞాపకార్థంగా జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. 2001, మే 25న మొట్ట మొదటిసారిగా ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించారని తెలిపారు. తప్పిపోయిన పిల్లల, అపహరణకు గురైన పిల్లల గురించి ప్రజల్లో అవగాహన పెంచడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు అని చెప్పారు. 2001 నుండి 6 ఖండాల్లోని 20కి పైగా దేశాల్లో ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు అని అన్నారు. 1998లో యున్కైటెడ్ స్టేట్స్‌లో ఐసిఎంఇసి అనే సంస్థ ప్రారంభించారని పిల్లల అపహరణ, పిల్లలపై లైంగిక వేధింపులు, పిల్లల దోపిడి లేకుండా ప్రపంచాన్ని సురక్షితమైన ప్రదేశంగా మార్చడానికి పనిచేస్తున్న లాబాపేక్ష లేని సంస్థ అని చెప్పారు. అల్బేనియా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బెలారస్, బెల్జియం, బ్రెజిల్, కెనడా, చిలీ, కోస్టారీకా, ఈక్వడార్, జర్మనీ, గ్రీస్, గౌతమాలా, ఐర్లాండ్, ఇటలీ, జమైకా, లుధియానా, మెక్సికో, నెదర్లాండ్స్, పోలాండ్, పోర్చుగల్, రష్యా, సెర్బియా, దక్షిణ కొరియా, స్పెయిన్, తైవాన్, యున్కైటెడ్ కింగ్‌డమ్, యున్కైటెడ్ స్టేట్స్ వంటి 29 దేశాలు ఈ సంస్థ పరిధిలో పనిచేస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లల అపహరణ సమస్యను గుర్తించడానికి, పిల్లలను సంరక్షణకు తీసుకోవాలసిన కొన్ని చర్యల గురించి తల్లిదండ్రులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చేలా ఐసిఎంఐసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది అని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరిండెంట్ జి.వీరయ్య, డిస్ట్రిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ జి చెన్నారెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, మెడికల్ ఆఫీసర్ జె లక్ష్మి, పిల్లలు పాల్గొన్నారు.

మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం మొత్తం 1035 మంది కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా విధులను కేటాయించాయించామని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని ఎన్ఐసి హాలులో జిల్లా జెసిగణేష్ కుమార్, జిల్లా ఎలెక్షన్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిఆర్ఓ గంగాధర్‌గౌడ్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి సార్వత్రిక ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి విధులను కేటాయించే మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులను సంబంధిత తహశీల్దార్ల ద్వారా అందజేస్తామని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి కడప నగరం అన్నమయ్య సర్కిల్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ (మెయిన్)లో 29న ఉదయం 09.00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణను కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులకు గైర్హాజరు అయిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి ర్యాండమైజేషన్ ద్వారా విధులను కేటాయించిన వారికి జూన్ 2వ తేదీన రెండవ ర్యాండమైజేషన్, జూన్ 4వ తేదీన ఉదయం 5 గంటలకు 3వ ర్యాండమైజేషన్ నిర్వహించి ఏ టేబుల్‌లో కౌంటింగ్ నిర్వహించాలో తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో పాటు సిపిఓ వెంకట్రావు, డిఐఓ విజయ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే మనుగడ

విశాఖ బ్యాంకు కడప బ్రాంచ్ మహాసభలో డైరెక్టర్ జె.వి.సత్యనారాయణ మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - కడప అర్బన్

పరస్పర సహకారంతోనే మానవుని మనుగడ సాగుతుందని, ఆ మూల సూత్రంతోనే 109 సంవత్సరాల కిందట ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఆవిర్భవించిందని బ్యాంక్ సీనియర్ డైరెక్టర్ జె.వి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ది విశాఖపట్నం కో - ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ కడప బ్రాంచ్ మహాసభ శనివారం స్థానిక శంకరాపురం ఎస్ఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బ్యాంక్ డైరెక్టర్ నారాయణస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జెవి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సహకార స్ఫూర్తితో, రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలను పాటిస్తూ ప్రజల బ్యాంక్ గా ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పనిచేస్తుందన్నారు. పట్టణ ప్రాంతాలలో పేద, మధ్య తరగతి వర్గాలకు విశేష సేవలందిస్తున్న బ్యాంక్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత, కర్తవ్యం సభ్యులపై ఉందన్నారు. దేశంలో సహకార సూత్రాలను పాటిస్తూ అన్ని బ్యాంక్ బ్రాంచ్‌లలో ప్రతి ఏటా మార్చి తర్వాత సభ్యుల మహాసభ నిర్వహణ ద్వారా వార్షిక సమీక్ష జరిపి సభ్యుల అభిప్రాయాలు,సూచనలు, సలహాలు తీసుకుంటున్న ఏకైక బ్యాంక్ ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అని పేర్కొన్నారు. జాతీయ, వాణిజ్య బ్యాంకులకు ఒక విధంగా సహకార బ్యాంకులకు మరో విధంగా రిజర్వు బ్యాంక్ నియంత్రణ చర్యలు చేపట్టి సహకార వ్యవస్థకు ఆర్బీఐ తూట్లు పొడుస్తోందన్నారు. కడపలో 8 ఏళ్ల కిందట ప్రారంభమైన బ్యాంక్ ద్వారా ఏడు కోట్ల ఏడు లక్షల రూపాయలు డిపాజిట్లు రాగా రూ.28 కోట్ల రుణాలు సభ్యులకు ఇచ్చామన్నారు. సహకార రంగంలో ఏ బ్యాంక్ అమలు చేయని సంక్షేమ పథకాలను బ్యాంక్ సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు తమ బ్యాంక్ అమలు చేస్తోందన్నారు. బ్యాంక్ సభ్యుల పిల్లల విద్యకు ప్రోత్సాహం, తక్కువ వడ్డీ కి రుణాలు తీసుకునే సదుపాయం ఉందని చెప్పారు. బ్యాంక్ అభివృద్ధికి, సేవల విస్తరణకు సహకరిస్తున్న సభ్యులకు, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. మహాసభలో జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జోనల్ మేనేజర్ ప్రసాద్ రావు, కడప బ్రాంచి మేనేజర్ తులసి కుమార్, బ్యాంకు సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యం : విద్యుత్ ఎస్ఇ




విద్యుత్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఇ

ప్రజాశక్తి-సుండుపల్లి

ఫిర్యాదులు లేని సేవలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని సానిపాయ 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సానిపాయ రైతులు తమ విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశఇంచారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎస్ఇ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల లైన్లు తెగిపడే అవకాశాలున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కారాదని సూచించారు. సర్వీస్ పొందిన మీటర్ ద్వారానే విద్యుత్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడూ సరిచేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు ఇస్తుందని, విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దు, వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాలని తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని ఆదేశించారు. లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయలను అరికట్టి నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారునితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించి సంస్థపై ప్రజలలో సంతృప్తికరస్థాయిని పెంచాలని తెలియజేశారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. సమావేశంలో రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చాంద్‌బాషా, అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్, 'పది' పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొదటి సంవత్సరం పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 6,036 మందికిగానూ 5,784 మంది హాజరయ్యారు. 252 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 479 మందికిగాను 439 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు.

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి రెగ్యులర్ అభ్యర్థులు 322 మంది హాజరు కావాల్సి ఉండగా 288 మంది హాజరయ్యారు. 34 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 91 మంది హాజరు కావాల్సి ఉండగా 81 మంది హాజరయ్యారు. 10 మంది గైర్హాజరయ్యారు. మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 37 సెంటర్లు, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం 20 సెంటర్లు కేటాయించారు. ఎటువంటి డీబార్లు నమోదు కాలేదు. ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య పులివెందుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలించారు. ఆర్‌జెడి, ఆర్ఐఓ, డిఇసి, ఫ్లయింగ్ స్క్వాడ్ 27 సెంటర్లు తనిఖీ చేశారు.

'పది' హిందీ పరీక్షకు 381 మంది హాజరు

పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా శనివారం హిందీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 318 మంది హాజరయ్యారు. 16 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. 64 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 8, డిఇఓ అనురాధ ఒక్క సెంటర్ తనిఖీ చేశారు.

వైసిపి నేత దారుణ హత్య

ఆధిపత్యంలో అడ్డొస్తున్నాడని హతమార్చిన వైనం
విలేకరుల సమావేశంలో డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి



శేషాద్రి (ఫైల్‌ఫొటో)



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట అనపగుట్ట శివారు ప్రాంతంలో శేషాద్రి(35) అనే వ్యక్తి ఆధిపత్య పోరులో శనివారం ఉదయం వేకువ జామున అత్యంత కిరాతకంగా హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గొల్లపల్లి దళితవాడకు చెందిన కొండుపల్లి ఆనంద్, అతని అనుచరులు చరణ్, మణికంఠ, చిన్నారెడ్డి మరి కొంత మంది అనుచరులు శనివారం అర్ధరాత్రి తర్వాత పుంగనూరు శేషాద్రి ఇంటికి వెళ్ళి దౌర్జన్యంగా ఇంటిలోకి చొరబడి, తలుపులు పగలగొట్టి కత్తులు, వేట కొడవళ్ళతో దాడిచేసి అతి కిరాతకంగా హత్య చేశారని, దీనిపై హత్యకేసుగా నమోదు చేశామని మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. పుంగనూరు శేషాద్రి, కొండుపల్లి ఆనంద్ బహుజనసేన సంస్థ ఏర్పాటు చేసుకుని కలసికట్టుగా సెటిల్మెంట్ కార్యక్రమాలు నిర్వహించే వారని వెల్లడించారు. శేషాద్రి రామారావుకాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, స్వతహాగా సెటిల్మెంట్ చేస్తుండటంతో ఇరువురు మధ్య వివాదం ఏర్పడింది. తన దందాలకు అడ్డొస్తున్న శేషాద్రి అంతమొందించాలని కొండుపల్లి ఆనంద్ పతకం ప్రకారం శనివారం రాత్రి తన అనుచరులతో దాడులు చేసి హత్య చేసినట్లు తెలిపారు. ఈ హత్య వెనుక ఎంతమంది వ్యక్తులు ఉన్నా, ఎంతటి వారైనా వదలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. గతంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవల్లో రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నా రన్నారు. చంపిన వారు, చనిపోయిన వారు వైసిపికి చెందిన వారేన న్నారు. పాత ముద్దాయి కొండుపల్లి ఆనంద్ 2014, 2020లో జరిగిన రెండు హత్య కేసులలో ప్రధాన ముద్దాయి అని, అతనిపై కోర్టులో కేసులు నడుస్తోందని తెలిపారు. ఆరుగురిపై మాత్రమే హత్యకేసులో ముద్దాయిలుగా పేర్కొన్నామని, ఇంకా కొంతమంది ఉన్నట్లు తెలిసిందని, విచారణలో ఎంతమందైనా, ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. ఇప్పటికే వన్ టౌన్ సిఐ వల్లిబాషా, టూటౌన్ సిఐ యూవరాజ్, రూరల్ సిఐ శేఖర్‌లతో మూడు టీములు వేసి నిందితును పట్టుకునేందుకు రంగంలోకి దిగారన్నారు.

వాహనాల తనిఖీ

కడప అర్బన్ : నగరంలోని ఎర్రముక్కపల్లె సర్కిల్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా వన్‌టౌన్ సిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ రంగస్వామి రికార్డులు పరిశీలించారు. మైనర్ డ్రైవింగ్ పాల్పడిన వారికి కౌన్సెలింగ్‌తో పాటు జరిమానా విధించారు. 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో లాడ్జిలు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్‌కు ముందు రోజైన జూన్ 3న లాడ్జీలను, ఫంక్షన్ హాళ్లను మూసివేయాలని, బస చేసిన ఇతర ప్రాంతాలకు చెందిన వారు స్వంత ఊర్లకు వెళ్లిపోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి స్థానికేతరులను లాడ్జిలలో, ఫంక్షన్ హాళ్లలో ఆశ్రయం కల్పించినట్లు తెలిస్తే ఆయా యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 4న నగరంలోని రెస్టారెంట్లు, హోటళ్లు అన్ని మూసివేయాలని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులకు నగరంలోకి ప్రవేశం లేదన్నారు. మెడికల్ ఎమెర్జెన్సీ మినహా ఇతర ఎలాంటి దుకాణాలు తెరవకూడదని చెప్పారు. నగరంలో 144 సెక్షన్‌తో పాటు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నాయని తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలందరూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి షరీఫ్

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్



ఉరుసు ఉత్సవాల్లో నాయకులు

రహమతుల్లా వీధిలో ఉన్న చారిత్రాత్మకమైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహమతుల్లా అలైహి వారి చాంద్ పీరా గుంబద్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుంచి గంధం కళశాన్ని ఫకీర్ల మేళ, తాళాలతో, విన్యాసాలతో దర్గా వద్దకు చేరుకున్నారు. అనంతరం గంధాన్ని సమర్పించారు. ఫాతెహా చేసి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, మైనార్టీ నాయకులు, ముస్లిములు పాల్గొన్నారు.

సయ్యద్ జుల్ఫికర్‌కు డాక్టరేట్

నందలూరు : హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ ఇండియా ద్వారా చేసిన సేవలకు మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ అరవపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జుల్ఫికర్‌కు రాజమండ్రిలో 25వ తేదీ ఉదయం జరిగిన డాక్టర్ రేట్ ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో డేస్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవలతో ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌పిసిఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ తాళ్లూరి ప్రసన్నకుమార్, సౌత్ ఇండియా చైర్మన్ శ్రీకృష్ణ?, హెచ్ ఆర్ పి సి ఐ చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షులు డాక్టర్ ఉమాదేవి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, పాల్గొన్నారని తెలిపారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం

కడప అర్బన్ : వైవీయూ ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నెలనెలా సీమ సాహిత్యం ఆదివారం నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు రామప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 132వ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'రాయలసీమ నదీ సాహిత్యం' అనే అంశంపై పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

కెజిసెట్-2కె24 ఫలితాలు విడుదల



ఫలితాల విడుదలలో కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

వరుసగా 4 సంవత్సరం విజయవంతంగా కెజి సెట్ -2కె24 ఫలితాలను కందుల గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కె.రాజేశ్వరితో కలిసి విడుదల చేశారు. ఈ నెల 1,2,3వ తేదీలలో నిర్వహించిన పరీక్షలకు విశేష స్పందన లభించింది. 3,900 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ఈ పరీక్షలలో విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మొదటి ర్యాంకు సాధించిన వారికి తమ కళాశాలల్లో ఉచితంగా విద్యతో పాటుగా వసతి కల్పిస్తామని, రెండో ర్యాంకు సాధించిన వారికి వసతి కల్పిస్తామని చెప్పారు. అలాగే మహిళా విద్యార్థినులకు కెఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ర్యాంకు వారికి విద్య, వసతి, రెండో ర్యాంకు వారికి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కళాశాల వైస్ చైర్మన్ కె.మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.నాగేశ్వర ప్రసాద్, కె ఎస్ ఎం ప్రిన్సిపల్ డాక్టర్.నాగమణి, కె ఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, అడ్మిషన్స్ డీన్ టి.కిషోర్ కుమార్, కెఎస్ ఆర్ ఎం అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వ్యవసాయ పంచాంగాలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో 2024-2025 సంవత్సరానికి సంబంధించి నూతన వ్యవసాయ పంచాంగాలు అందుబాటులో ఉన్నాయని కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ పంచాంగంలో వివిధ వ్యవసాయ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. నవీకరించబడిన సమగ్ర సమాచారం ఉందన్నారు. వ్యవసాయ పంచాంగం ధర రూ. 270 అని, కడప, అన్నమయ్య జిల్లాల రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న డీకే చదువుల బాబు

పద్య పఠనంతో విలువలు పరిమళిస్తాయి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

పద్య పఠనంతో విలువలు పరిమళిస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు తెలిపారు. పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు శనివారం బాలబాలికల గ్రంథాలయ ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ పద్యాలు పఠించడం వల్ల పఠణాశక్తి, భాష మీద పట్టు వస్తుందన్నారు. వేమన, సుమతి, వెలుగు బాల వంటి శతకపద్యాలు మంచిని బోధిస్తాయన్నారు. మంచిచెడు విచక్షణను తెలియజేస్తాయన్నారు. రిటైర్డ్ వైమానిక దళ ఇంజనీర్ వెంకట కొండయ్య విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఇబ్రం సాహెబ్, అధ్యాపకుడు గోపి నాయక్, డ్రాయింగ్ మాస్టర్ సుభాష్, రెహమాన్ ఖాన్, సారమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు : చాపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గ్రంథాలయ అధికారి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు, పుస్తక పఠనం అలవాటు చేస్తున్నామన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి వినోద్‌కుమార్

గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ కోరారు. పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండల పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం ఆయన వేముల పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా అందరూ ప్రశాంతంగా ఉండా లని సూచించారు. బాణసంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. పోలీసు వారి ఆదేశాలను భేఖాతరు చేస్తూ ఎవరైనా గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం డిఎస్‌పి పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వేముల ఎస్‌ఐ ధనుంజయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ విక్రయాలపై పోలీసుల నిఘా

ప్రజాశక్తి - సింహాద్రిపురం

జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో పోలీసులు పులివెందుల నియోజకవర్గంలో జల్లెడ పడుతున్నారు. ఇందులో భాగంగా పెట్రోల్ లూజ్ అమ్మకాలపై నిఘా పెట్టారు. వాహనాలకు మాత్రమే పెట్రోల్ పట్టాలని బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువ పెట్రోల్ కొనుగోలుపై ఆరా తీస్తున్నారు. వైసిపి అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎన్‌డిఎ తరపున మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేసిన విషయం విదితమే. బీటెక్ రవి సొంత మండలం సింహాద్రిపురం కావడం పట్ల పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నియోజవర్గంలో ఎన్నికల సజావుగా ముగిసినా.. ఫలితాలు త్వరలో ప్రకటించనున్న నేపథ్యంలో అల్లర్లు జరక్కుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో సైతం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ అనిల్‌కుమార్ హెచ్చరిస్తున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.


అన్నదాన కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి

అన్నదానం చాలా గొప్పది

ప్రజాశక్తి - చక్రాయపేట

అన్నదానం చాలా గొప్పదని దశరథ మహారాజు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బరామయ్య తెలిపారు. మండలంలోని నాగలగట్టుపల్లె-దేవరకట్టుపల్లె మధ్యలో ఉన్న దశరథ మహారాజు ఆలయం వద్ద శనివారం ఎరువులు అంగడి వెంకట్రామిరెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ప్రతి శనివారం భక్తులు అన్నదాన కార్యక్రమం చేయడంతో ఇక్కడ వాల్మీకి రామాయణ పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి, సమేత దశరథ మహారాజు వెలిసి ఉండడంతో నిత్యం పూజలు నిర్వహిస్తున్నట్లు సుబ్బరామయ్య తెలిపారు.

రేపు ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

శ్రీవారి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌వి ఫంక్షన్ హాల్ (అలంకార థియేటర్)లో అన్నదానం చేస్తున్నామని అధ్యక్షులు సుధాకర్‌గుప్తా, ప్రధాన కారదర్శి వెంకటకృష్ణగు, కోశాధికారి గుర్రం శ్రీనివాసులు తెలిపారు. స్థానికంగా శనివారం వారు మాట్లాడుతూ శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంగనబోయిన రాధాకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి, నందీశ్వరయ్య పాల్గొన్నారు.

చుక్కల్లో నిత్యావసర ధరలు

ముట్టుకోనివ్వని మాంసం ధరలు గగనమవుతున్న సామాన్యుల బతుకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినటట్లేదు.. కొండెక్కిన కూరగాయ ధరలు, చుక్కలు చూపిస్తున్న నిత్యావసర ధరలు, ముట్టుకోనివ్వని మాంసం ధరలు సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా రోజురోజుకూ ధరలు పెరుగుతుండడంతో సామాన్యుని బతుకు భారమవుతోంది. ధరలను నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయనే ఆరోపణలున్నాయి. గతేడాది వర్షపాతం తగ్గడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. వర్షాభావంతో పంటల దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో నిత్యావసర, కూరగాయల ధరలు గణనీయంగా పెరగడానికి కారణమయ్యాయి. ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరఫరా చేసి సామాన్యులపై ఉన్న భారాన్ని తగ్గించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కొండెక్కిన కూరగాయలు..

కూరగాయల మార్కెట్‌లో ఒకటి రెండు తప్ప.. మిగతా వన్నీ కిలో రూ.80పైనే పలుకుతున్నాయి. టమాట, వంకాయ మాత్రమే కిలో రూ.40 లోపు ఉన్నాయి. బెండకాయ, దొండకాయ, చిక్కుడు, బీరకాయ, గోరుచిక్కుడు, పులగంద, క్యాప్సికం రేట్లు కిలో రూ.80పైనే ఉన్నాయి. రూ.5కు దొరికే మునక్కాయ ఇప్పుడు రూ.10 అయింది. ఎండాకాలంలో కూరగాయల ఇలా రేట్లు పెరగడంతో జనం అల్లాడుతున్నారు.

చుక్కలు చూపిస్తున్న నిత్యావసర ధరలు..

కందిపప్పు, పెసరపప్పు మొన్నటి వరకు కిలో రూ.110 వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.180కి చేరాయి. నువ్వులు కిలో రూ.200 దాటాయి. మినపప్పు కిలో రూ.140 నుంచి రూ.180 వరకు వెళ్లింది. పల్లినూనె రేట్లు కిలో రూ.160కి తక్కువ లేవు. కంపెనీ పల్లి నూనె రూ.190 పలుకుతోంది. సన్‌ఫ్లవర్ నూనె రేట్లు రూ.115 నుంచి రూ.120, పామాయిల్ రేట్లు రూ.90 నుంచి రూ.100 వరకు ఉన్నాయి. ఇక అల్లం కిలో రూ.200 దాటగా, తెల్లగడ్డలు కిలో రూ.200 దాకా అమ్ముతున్నారు. ఏడాది కిందట క్వింటాల్ బియ్యం రూ.4,500 నుంచి రూ.5వేల మధ్య ఉండగా.. ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.7 వేల దాకా అమ్ముతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బియ్యం రేట్లను సగటున రూ.600 నుంచి రూ.800 దాకా పెంచేశారు. పాత రకాలను రూ.7,200 నుంచి రూ.7,400 దాకా అమ్ముతున్నారు. బియ్యం రేట్లను వ్యాపారులు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. గతంలో బియ్యం రేట్లపై ప్రభుత్వం నియంత్రణ ఉండేది. మిల్లులకు, మన అవసరాలకు మించి స్టాక్ ఉన్నప్పుడే ఎగుమతులకు అనుమతులు ఇచ్చేవారు. బియ్యం రేట్ల నియంత్రణ చేయడంలో ప్రభుత్వం విఫలమైనందున మిల్లర్లంతా సిండికేట్‌గా మారి, ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.


దుకాణంలో అమ్మకానికి ఉంచిన చికెన్, నిత్యావసర వస్తువులు, కూరగాయలు

భగ్గుమంటున్న మాంసం ధరలు

కూరగాయల ధరలతోపాటు మాంసం ధరలు భారీగా పెరిగాయి. కిలో మటన్ రూ.800, చికెన్ గతంలో రూ.180 ఉండేది. ఇప్పుడు రూ.280, స్కిన్ లెస్ చికెన్ రూ.300 అమ్ముతున్నారు. కోడిగుడ్డు రేటు కూడా రూ.5నుంచి రూ.7కు చేరింది. కూరగాయల రేటుతోపాటు మాంసం రేట్లు కూడా పెరగడంతో ఏం తినాలో అర్థం కాని పరిస్థితుల్లో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు.

జీతం సరిపోవడం లేదు..

కూరగాయలు, నిత్యవసర సరుకులు, మాంసం ధరలు అమాంతం పెరగడంతో వచ్చే జీతం సరిపోవడం లేదు. నెలకు రూ.12వేలు జీతం వస్తే సరుకులకే సరిపోతుంది. ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తోంది.

- గోపాల్ రెడ్డి, చిరుద్యోగి, పులివెందుల

అప్పు చేయక తప్పడంలేదు..

కూరగాయల ధరలు విపరీతంగా పెరగడం వల్ల మార్కెట్‌కు పోతే రూ.600అవుతోంది. నిత్యవసర ధరలు పెరగడం, దీనికి తోడు ఎండాకాలం కావడంతో కూలి పనులు కూడా లేవు. జీవనం సాగించడానికి అప్పు చేయక తప్పడంలేదు.

- భవాని, వ్యవసాయ కూలీ, పులివెందుల

పచ్చళ్లతో సర్దుకుపోతున్నాం..

ధరలు పెరగడం వల్ల కూరగాయలు కొనలేక పచ్చళ్లతో సర్దుకుపోవాల్సి వస్తోంది. వచ్చే ఆదాయంలో నిత్యవసర వస్తువులు కొనే పరిస్థితి లేదు. బతకడానికి కావాల్సిన వస్తువులు మాత్రమే మార్కెట్ నుంచి తెచ్చుకుంటున్నాం.

- దేవి, గృహిణి, పులివెందుల

తల్లిదండ్రులు మెచ్చిన గౌతమ్ హైస్కూల్

నాణ్యతతో కూడిన విద్యాబోధన - వంద శాతం ఉత్తీర్ణత



గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు వారి తల్లిదండ్రులు మెచ్చిన విద్యాలయం గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్. ఆ మేరకు పాఠశాల కరస్పాండెంట్ ఎ.లక్ష్మీరెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. పట్టణంలో క్వాలిటీ ఎడ్యుకేషన్‌కు అడ్రస్ తమ పాఠశాలే అన్నారు. క్వాలిఫైడ్ టీచర్స్‌తోపాటు మంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయులున్నారన్నారు. కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా జమ్మలమడుగు పట్టణంలో గౌతమ్ హైస్కూల్ ఉందన్నారు. అధునాతన విద్యతోపాటు విద్యార్థుల మానసిక వత్తిడి తగ్గించేలా యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం తమ హైస్కూల్ ప్రత్యేకత అన్నారు. ఐఐటి ఫౌండేషన్ కోర్స్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఏకైక విద్యా సంస్థ గౌతమ్ ఇంగ్లిస్ మీడియం హైస్కూల్ అన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పాఠశాల స్థాయిలోనే ఓర్పు, ఏకాగ్రత, క్రమశిక్షణ కలిగి ఉండేలా చూస్తు న్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన గదుల్లో విద్యా ర్థులకు నాణ్యమైన డిజిటల్ బోధన చేస్తున్నామన్నారు. ప్లే స్కూల్ వాతా వరణం తలపించేలా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి పిల్లలకు ఆట వస్తువులు ఉన్నా యన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఎక్కడి కెళ్లినా పిల్లలు గర్వంగా ఉండేలా చేయడం తమ హైస్కూల్ మరో ప్రత్యేకత అన్నారు. ప్రతిరోజు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ నిర్వహిస్తామన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామన్నారు. కంప్యూటర్ శిక్షణ నిస్తున్నామన్నారు. సిసి కెమెరాల ద్వారా తరగతి గదుల పర్యవేక్షణ ఉంటుం దన్నారు. నెలకు రెండు సార్లు ఐఐటి, సిడిఎఫ్ పరీక్షలు నిర్వహించి వారి సామ ర్థ్యం గుర్తించి అందుకు తగ్గట్టు విద్యను బోధిస్తున్నామన్నారు. ఇంటిని మరిపించేలా స్కూల్ వాతావరణం ఉంటుందన్నారు. వ్యాన్ సౌకర్యం కలదన్నారు. 2023లో పదవ తరగతి చదివి 2024 జూని యర్ ఇంటర్ ఎంపిసిలో తెలంగాణ రాష్ట్రంలో రెండవ స్థానంలో కె.నిత్యా, ఎస్.కె.జమాల్ బాషా విజయకేతనం ఎగరవేశారన్నారు. 2024 విద్యా సంవత్సరంలో 589 మార్కులతో ఎస్.శివ జితేంద్రరావు, 581 మార్కులతో శ్రీకర్‌తోపాటు 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 14 మంది ఉండడం గర్వకారణమన్నారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో 100కి 100 మార్కులు వచ్చాయన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని తమ పాఠ శాల ప్రతి విభాగంలో ముందంజలో ఉందన్నారు. అడ్మిషన్స్, వివరాలకు 91004 03080, 81061 09588ను సంప్రదించాలని ఆయన కోరారు.


కరస్పాండెంట్ ఎ.లక్ష్మిరెడ్డి


ఆహ్లాదకర వాతావరణంలో స్కూల్ భవనాలు

బురద కుంటను తలపిస్తున్న బోలె వార్డు

సుందరీకరణ చేసినా.. చిన్నపాటి వర్షానికే జలమయం



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ నడి వీధిని అత్యంత సుందరీకరణతో తీర్చిదిన సెంట్రల్ బోలె వార్డు చిన్నపాటి వర్షానికే బురద కుంటను తలపిస్తోంది. శుక్రవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి బోలె వార్డులో వర్షపు నీరు ఎక్కడ చూసినా నిలిచి ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పులివెందుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. ఇందులో సెంట్రల్ బోలె వార్డుకు రూ.5.40 కోట్లు వెచ్చించి అత్యంత సుందరీకరణ చేశారు. అయితే అధికారులు నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోకుండా పనులు ప్రారంభించడంతో ప్రస్తుతం చిన్నపాటి వర్షానికి సెంట్రల్ బోలే వార్డులో బురద నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లకుండా ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఆ వర్షపు నీటి వల్ల ఏర్పడిన బురద వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. వాహనాలు అటుఇటు తిరుగుతూ ఉన్నప్పుడు ఆ బురద పాదచారులపై పడుతోంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి వర్షపు నీరు నిలవకుండా పోయేలా చర్యలు తీసుకోవాలని బోలె వార్డు ప్రజలు కోరుతున్నారు.

మురుగునీరు తొలగించండి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లో మురుగు కాలువలలోని నీరు రోడ్లపై ప్రవహిస్తోందని, వెంటనే తొలగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ కోరారు. ఆ మేరకు శనివారం నగర పంచాయతీ ఆర్‌ఒ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ పూడిక తీయకపోవడంతో మురుగునీరు కాలవలు వెంబడి కాకుండా రోడ్లపై పారుతోందన్నారు. ముద్దనూరు రోడ్డులోని ప్రధాన కాలువకు వీధుల్లోని కాలువలకు అనుసంధానం చేయలేదని, తద్వారా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసనను వెదజల్లుతున్నాయని తెలిపారు. మురుగునీరు ప్రధాన కాలువల్లో కలిసేలా ప్రధాన కాలువకు రంధ్రాన్ని వేయాలని సూచించారు. సమస్యను శానిటేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని ఆర్‌ఒ గంగిరెడ్డి హామీ ఇచ్చారు.


ఆర్‌ఒ గంగిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అన్వేష్

రూ.1.19 లక్షల విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి వీరాంజనేయ స్వామి దేవాలయానికి విచ్చేసే భక్తులకు వివిధ దాతల ద్వారా రూ.1,19,067 నిత్య అన్నదానానికి విరాళాలు అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. వేంపల్లి మండలం అలవలపాడు గ్రామానికి చెందిన పేరం చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమా రులు విష్ణువర్ధన్‌రెడ్డి, చక్ర పాణిరెడ్డి రూ.25,116 తో పాటు అన్నదానం వద్ద భక్తుల ద్వారా రూ.94,971 వచ్చినట్లు వారు తెలిపారు. వేసవి సెలవులు కావడంతో శనివారం తెల్లవారుజాము నుండి ప్రధాన అర్చకులు కేసరి స్వామి ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం చేసి పలు రకాల పూలతో అలంకరించారు. భక్తులతో గండి క్షేత్రం పోటెత్తింది. దాతల సహకారంతో ప్రతిరోజు నిత్య అన్నదానం ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమని భక్తులు పేర్కొన్నారు.


దాతకు ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎసి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జి.రమణారెడ్డి

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

మున్సిపల్ కమిషనర్ జి.రమణారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక సంఘ పరిధిలో అన్ని రకాల వ్యాపార సంస్థల యజమానులు ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ జి.రమణారెడ్డి హెచ్చరించారు. ఆ మేరకు శనివారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో ఉన్న వ్యాపార సంస్థల యజమానులు ప్లాస్టిక్ బదులు వాటి స్థానంలో దుస్తుల సంచులు, జనప నార సంచులు, ఇతర బయోడిగ్రేడబుల్ వంటివి వాడాలని సూచించారు. 120 మైక్రాన్‌లోపు ఉన్న అన్ని రకాల ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాయన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడితే వారికి రూ.5000 నుంచి రూ.40వేల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. వినియోగదారుడు వాడితే రూ.500 జరిమానా విధిస్తామన్నారు. పట్టణంలోని చిన్న హోటల్స్, ప్రధాన హోటల్స్‌లో ఇడ్లీ తయారు చేయుటకు క్లాత్‌ను మాత్రమే వాడాలన్నారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన పదార్థాలు అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, వాటి స్థానంలో అరటి, విస్తరాకులు వాడాలన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం నియంత్రించుటకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా అన్ని వ్యాపార సంస్థలను తనిఖీ చేస్తామన్నారు. ఆ సమయంలో ప్లాస్టిక్ వాడకం గమనిస్తే వారిపై భారీగా జరిమానా విధించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించి, ప్లాస్టిక్ రహిత పులివెందుల, స్వచ్ఛ పులివెందుల ఏర్పాటు చేసుకొనుటకు సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.మురళీధర్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

ఒడుగులు చేయించడం మంచి సంప్రదాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇస్లామియా షాదీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఒడుగుల కార్యక్రమాన్ని స్థానిక ఇంటర్నేషనల్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజుమన్ మాజీ అధ్యక్షుడు ముక్తియార్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్ నాయుడు మాట్లాడుతూ ఒడుగులు చేయించుకోడం ఆరోగ్యపరంగా మంచి సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈరానిబాషా, ఖలీల్, ముర్తుజాహుశేన్, అయూబ్‌ఖాన్, ఎర్రబల్లె దాదాపీర్, షబ్బీర్, జమీల్, ఖాదర్‌బాషా, మైను పాల్గొన్నారు.


ఒడుగులు చేయించుకున్న పిల్లలతో ముక్తియార్, నేతలు